


పీజీ కోర్సులపై అవగాహన కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ



క్యాంపస్ : ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే డిగ్రీ విద్యార్థులకు పీజీ కోర్సులపై సమగ్ర అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యతని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ సెక్రటరీ కె.వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వ విద్యాలయాల్లో వివిధ రంగాల్లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా మందికి సరైన సమాచారం అందడం లేదన్నారు. ఏ కోర్సు వల్ల ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి, పరిశోధన అవకాశాలు ఎక్కడ లభ్యమవుతాయి అనే విషయాలపై స్పష్టత లేని పరిస్థితి నెలకొందన్నారు. అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు, ప్రవేశ విధానాలు, ఫీజు నిర్మాణం, స్టైపెండ్‌లు, స్కాలర్‌షిప్‌లు అవకాశాలు వంటి వివరాలను వివరించాలన్నారు.

పాల <-> కన్నీటి ధార





పాడి రైతుకు గిట్టుబాటు ధర ఏది..?
లీటర్‌కు చెల్లిస్తున్నది రూ.31
ఏటేటా దాణా రేట్లు రెట్టింపు
మిల్క్ అనలైజర్‌లో గందరగోళం..?





'డబ్బులు ఊరికే రావు..' వాస్తవం.. అయితే 'కష్టపడినా రావు' అన్నది పాడి రైతుల కష్టాన్ని చూస్తే అర్థమవుతుంది. ఎండనకా, వాననకా పాడి రైతులు పశువులను మేపి, దాణా రేట్లు పెరిగినా కష్టాలకోర్చి ఖర్చు పెడుతుంటే లీటర్ పాలకు రూ.31 కూడా అందడం లేదు. అదీ మిల్క్ అనలైజర్‌లో గందరగోళం నెలకొందన్న ఆరోపణలూ లేకపోలేదు. లీటర్ పాలు మార్కెట్లో రూ.75 పలుకుతుంటే రైతుకు మాత్రం సగం రేటు కూడా గిట్టుబాటు కాకపోవడం పశువుల పాల ధారతో సమానంగా పాడి రైతుల కన్నీటి ధార కనిపిస్తోంది.

ప్రజాశక్తి - ఏర్పేడు

పాడి పరిశ్రమ వ్యవసాయ రంగంలో రైతుకు ఒక ఆసరా. పంట వేసి నష్టపోయిన రైతుకి పాడి పరిశ్రమ వెనుదన్నుగానే ఉంటుందనే చెప్పాలి. ఏపీ పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉండగా ఇందులో తిరుపతి జిల్లా కూడా ముఖ్య భాగం. ఏర్పేడు మండలంలో పాడి రైతుల ఆవు/ గేదె పాలు విక్రయంలో ప్రైవేట్ డెయిరీ కంపెనీలు శ్రీజ, దొడ్ల, హెరిటేజ్ ఉన్నాయి. మండలంలో పలుచోట్ల శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటుచేసి ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. పోటీపడి మరీ రెండు లేదా మూడు డెయిరీ యూనిట్లు ఒక్కో గ్రామంలో పాల సేకరణ కేంద్రాలు(మిల్క్ ప్రొక్యూరింగ్ పాయింట్స్) ఏర్పాటు చేసి రైతుల నుండి పాలను సేకరిస్తున్నారు. అయితే రైతుకు గిట్టుబాటు ధర మాత్రం అంతంత మాత్రమే. ఆవులు/ గేదెలు విక్రయ ధరలు అధికంగా ఉన్నప్పటికీ లాభసాటి ఆదాయమని ఆలోచించి ముందడుగు వేసి మరి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గడ్డి, దాణా, పశువైద్యం, కతిమ గర్భధారణ అన్నింటికీ ధరలు పెరిగాయి. ప్రైవేట్ డెయిరీలు మాత్రం రైతుకిచ్చేది రూ.31, మార్కెట్లో అమ్ముకునేది రూ.74 నుండి 80 వరకు. ఒక డెయిరీ అయితే 2.5 వెన్న శాతం ఉన్న లీటరు ఆవు పాలకు రైతుకు రూ.31చెల్లిస్తున్నారు. మరొక డెయిరీ అయితే 3.0 వెన్న శాతం ఉన్న ఆవు పాలుకు రూ. 30.25 చెల్లిస్తున్నారు. అవే పాలు మార్కెట్‌లో వినియోగదారులకు వెన్న శాతం తగ్గించి అధిక ధరలకు అమ్ముతున్నారు. 5.2వెన్న శాతం ఉన్న లీటరు గేదె పాలకు రూ.42 చెల్లిస్తున్నారు. రైతుల వద్ద సేకరించిన పాలు నుండి వెన్న శాతం తగ్గించి రూ.74 నుండి 80 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇంతే కాకుండా ఉప ఉత్పత్తుల నుండి రెట్టింపు ఆదాయాన్ని డెయిరీ పరిశ్రమలకు వస్తుంది. ఇంత భారీ లాభాల్లో ఉన్న డెయిరీలు మాత్రం పాడి రైతులను మోసం చేస్తున్నాయని మహిళా రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి డెయిరీలపై నిఘా ఉంచి పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుకుంటున్నారు.

దయనీయ జీవితం

కష్టపడుతున్నాం ఫలితం శూన్యం


సావిత్రమ్మ, పాడి రైతు

లీటర్ వాటర్ బాటిల్ ధర 20 రూపాయలు, లీటర్ పాల ధర రూ. 30.25. నేను రెండు పూట్ల ఐదు ఆవుల నుండి 25 నుంచి 30 లీటర్లు మా గ్రామంలోని శ్రీజ డెయిరీకి పోస్తున్నా. రేటు మాత్రం లీడర్ కి 31 రూపాయి ఇస్తున్నారు. 15 రోజులకు ఒకసారి డబ్బులు అకౌంట్లో జమవుతాయి. వచ్చిన మొత్తం వాటి దాణా ఖర్చులకు, వైద్యానికే సరిపోతున్నాయి. లాభంగా ఒక రూపాయి కూడా మిగులు లేదు. ఇలా అయితే నాకు త్వరలోనే ఆవులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవసాయంలోనూ గిట్టుబాటు ధర లేక, దిగుబడి రాక నష్టాలను చవి చూస్తున్నాం.



మిల్క్ అనలైజర్లో పాయింట్లు మార్చేస్తున్నారు : సుబ్బయ్య, పాడి రైతు

మా గ్రామంలో మూడు డెయిరీలు పోటీగా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసాయి. ఏర్పాటు చేసిన మొదట్లో గిట్టుబాటు రేటు కొంతమేర ఇచ్చిన నెమ్మదిగా రేటు తగ్గిస్తారు. పాలలోని వెన్న శాతాన్ని కొలిచే అనలైజర్లలో పాయింట్లు తగిస్తున్నారని తెలుస్తున్నది. రోజు వారిచ్చే బిల్లులలోని అమౌంట్ 15 రోజులకు ఒకసారి మా అకౌంట్లో జమయ్యే అమౌంట్‌తో సరిపోవట్లేదు.



రేణిగుంటలో నివాళి అర్పిస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రపంచీకరణ తొలి విమర్శకులు కారల్ మార్క్స్

ప్రజాశక్తి - రేణిగుంట, శ్రీకాళహస్తి, యంత్రాంగం

'ప్రపంచీకరణ తొలి విమర్శకులు కారల్‌మార్క్స్...ఆయన రచించిన సిద్ధాంతం కార్మికుల ఊపిరి' అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య ఉద్ఘాటించారు. కారల్‌మార్క్స్ 207వ జయంతిని వామపక్ష శ్రేణులు నిర్వహించాయి. రేణిగుంట సభలో కందారపు మురళి మాట్లాడుతూ జర్మనీకి చెందిన తత్వవేత్త కారల్‌మార్క్స్ చాలా గ్రంథాలు రాశారని, ఆయన రాసిన వాటిలో కమ్యూనిస్టు ప్రణాళిక, పెట్టుబడి గ్రంథాలు ప్రపంచంలోని చాలా దేశాల్లో కోట్లాది మంది ప్రజలపై రాజకీయంగా, ఆర్థికంగా చాలా ప్రభావం చూపాయన్నారు. ప్రపంచీకరణ తొలి విమర్శకులు ఆయనేనని అన్నారు. వర్గ పోరాటం ద్వారానే చివరకు కార్మికవర్గం మొత్తం ప్రపంచమంతటా బూర్జువా వర్గాన్ని కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్, రేణిగుంట- ఏర్పేడు మండలం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, కరీముల్లా, రంగయ్య, దిలీప్ భాషా, రేణిగుంట టౌన్ కార్యదర్శి ఈశ్వరమ్మ, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్, తారకరామనగర్ కార్యదర్శి సత్య శ్రీ, శివానందం, తదితరులు పాల్గొన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంథమనేని శివయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ నివాళి అర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి పుచ్చలపల్లి సుందరయ్యభవనంలో అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రాపూరు సుబ్రమణ్యం, రాధమ్మ, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రావు..ఉద్యోగ భద్రత లేదు

- 'ఉపాధి' ఫీల్డు అసిస్టెంట్ల వెతలు
- 'పే స్కేల్' ఊసెత్తని 'కూటమి'
- కనీస వేతనం రూ.18వేలివ్వాలి
- 20న సమ్మెకు సమాయత్తం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పేదోడికి కడుపునిండా తిండి..చేతినిండా పని కల్పించడంలో క్షేత్రస్థాయిలో క్షేత్ర సహాయకులదే కీలక పాత్ర. అలాంటి క్షేత్ర సహాయకులు సకాలంలో వేతనాలు రాక.. ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పించి పే స్కేల్ వర్తింప చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఏడాది గడుస్తున్నా ఆ హామీ ఊసే లేకుండా పోయింది. దీంతో ఈనెల 20వ తేదీన క్షేత్ర సహాయకులు ఒక్కరోజు సమ్మె చేసేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం.

ఇరవై ఏళ్లుగా ఎదురుచూపులు

కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ఫలితంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 2005లో అప్పటి యూపీఏ-1 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం కూలీలు వలసలు నివారించి ఉన్నచోట ఉపాధి కల్పించడమే. ఈ పథకంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఉన్నత స్థాయి అధికారులను, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. అయితే పథకం ప్రారంభమై 20 ఏళ్లు గడిచిపోతున్నా అందులో పని చేసే సిబ్బందిని క్రమబద్ధీకరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా వ్యాప్తంగా 819 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరిని కనీసం హెచ్‌ఆర్సీ పరిధిలోకి కూడా ప్రభుత్వం తీసుకురాకపోవడంతో సకాలంలో వేతనాలు రాక, సరైన జీతం అందక, ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్న పరిస్థితి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా క్షేత్ర సహాయకుల మెడపై రాజకీయ వేధింపుల కత్తి వేలాడుతుంది. ఈ లెక్కన ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజకీయ వేధింపులతో 50 శాతం మంది క్షేత్ర సహాయకులను తొలగించేస్తున్న పరిస్థితి కనబడుతుంది. మరీ ముఖ్యంగా తూర్పు మండలాల్లోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్షేత్ర సహాయకులపై రాజకీయ వేధింపులు హెచ్చుమీరాయనీ, 20 మంది పొట్టకొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు కనీసం ఉద్యోగ భద్రత అయిన కల్పిస్తే రాజకీయ వేధింపులు ఉండవనీ, అందుకోసం 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని క్షేత్ర సహాయకులు వాపోతున్నారు.

రెండు నెలలుగా అందని వేతనాలు

ఫీల్డ్ అసిస్టెంట్లను రెండు కేటగిరీలుగా విభజించి ప్రభుత్వం వేతనాలు అందజేస్తున్నది. మొదటి కేటగిరీలో నెలకు(7 వేలు పని దినాలు) రూ. 10 వేలు, రెండో కేటగిరీలో(2 వేలు పని దినాలు) రూ. 6వేలు ఇస్తున్నారు. కూలీలకు వంద రోజుల పని కల్పించడంతో పాటు గ్రామ పంచాయతీలో జరిగే అభివద్ధి పనులను క్షేత్ర సహాయకులే పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ రకాల యాప్లతోపాటు ఏడు రకాల రిజిస్టర్లను చేత సహాయకులు నిర్వహిస్తున్నారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత రెండు నెలలుగా వేతనాలు అందక కుటుంబాన్ని నడపడం కష్టతరంగా మారింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల మాదిరిగా ఏపీలోనూ క్షేత్ర సహాయకులను క్రమబద్ధీకరించి రూ. 18 వేలు కనీస వేతనాన్ని ఇవ్వాలని వారు కోరుతున్నారు.

శెట్టిపల్లి మార్గం పనులు పున:ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేట్ వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు మార్గం పనులు సోమవారం పున్ణ ప్రారంభం అయ్యాయి. ఈ మార్గంలో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో నూతన కల్వర్టులు నిర్మించడానికి గుత్తేదారు రమేష్ నాయుడు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మార్గంకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాన్ని నిర్మించడానికి భూమిని చదును చేశారు. పూర్తిస్థాయిలో రోడ్డు మార్గం పనులు వేగవంతం జరగాలంటే ఈ మార్గంలో ఉన్న తెలుగు గంగ నీటి పైపులైను కుడి వైపు ఉన్న రోడ్డు మార్గం నుండి ఎడమవైపు మళ్లించడానికి రూ. 2.85 కోట్ల రూపాయలు అవుతుందని, ఇందుకోసం టిటిడి బోర్డులో ఈ నిధులు మంజూరు చేయడానికి సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ విభాగానికి బోర్డు సమావేశంలో తీర్మానించనున్నారు. ఈ పైపులైను మార్పు కోసం టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, వైద్యం శాంతారామ్ తో కమిటీని వేశారు. ఈ కమిటీ వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి టిటిడికి నివేదికను సమర్పించనుంది. వర్షాకాలం రాకముందే రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచడానికి గుత్తేదారు రమేష్ నాయుడు



అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటానని తెలిపారు.

తెలుగు గంగ పైపుకు మరమ్మతులు

శెట్టిపల్లి మార్గం నిర్మాణ పనులు పున్ణ ప్రారంభం అవడంతో రేణిగుంటకు సరఫరా అయ్యే తెలుగుగంగ నీటి పైపులైనుకు మరమ్మత్తులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం తర్వాత ఎటువంటి తెలుగు గంగా నీటి సరఫరాకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శెట్టిపల్లి మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వందలాదిమంది ఈ మార్గం గుండా తమ పనులకు వెళ్లి రావడానికి, రేణిగుంట ప్రధాన రోడ్డు మార్గంలో ఏదేని నిర్మాణ పనులు సాగించే సమయంలో ప్రత్యామ్నాయ రోడ్డుగా కూడా శెట్టిపల్లి మార్గం ఉపయోగపడుతుంది. గత వైసిపి హయాంలో అప్పటి టిటిడి బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి నిధులతో ఈ రోడ్డు మార్గం నిర్మాణానికి రూ.15.16 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించిన విషయం విధితమే.



కలెక్టర్‌కు ముస్లిం పెద్దల వినతి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 293 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), తిరుపతి టౌన్

జిల్లా నలుమూలల నుండి క్షేత్రస్థాయిలో పరిష్కారం కానీ వివిధ రకాల సమస్యల సావధాన పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీదారుడు కి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వేసవి దష్ట్యా అర్జీదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మజ్జిగ, మంచినీరును అధికారులు అందుబాటులో ఉంచారు. మొత్తం పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి 293 అర్జీలు రాగా రెవిన్యూ శాఖకు సంబంధించి 189 అర్జీలు వచ్చాయి.

రోడ్లపై పడిన చెట్లకొమ్మలు తొలగించండి

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 46 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా నలుగురు తమ సమస్యలు తెలుపగా, 42 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికష్ణలు పాల్గొని అనాథ శవాలను తరలించేందుకు వాహన ఏర్పాటు చేయాలని కమిషనర్ ను కోరారు. భవానినగర్‌లో యుడిఎస్ బ్లాక్ అయ్యిందని, డబుల్ డెక్కర్ బస్సు వినియోగంలోకి తీసుకురావాలని, తిమ్మినాయుడుపాలెం రోడ్డుపక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బంకును తొలగించాలని, కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు ఇప్పించాలని తదితర సమస్యలు వచ్చాయి.

ఉర్దూ పాఠశాలను విలీనం చెయ్యొద్దు

రేణిగుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలలకు బదిలీ చేయకూడదని, సదరు ఉర్దూ పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్ గానే కొనసాగించాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో రేణిగుంట మైనార్టీ మత పెద్దలు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. మాజీ ఉపసర్పంచి జికె మునీర్ మాట్లాడుతూ రేణిగుంట పట్టణ పరిధిలో ఉన్న దాదాపు 35 శాతం ముస్లీం మైనార్టీ పిల్లల కోసం అప్పటి అటవీ శాఖా మాత్యులు బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి ఉర్దే పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి, పక్క స్కూలు భవన నిర్మాణానికి 26 లక్షలు మంజూరు చేశారన్నారు. గతంలో ఈ స్కూలులో 70 మంది విద్యార్థులతో ఎనిమిది తరగతులు నిర్వహించారన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గిందని సాకుగా చూపిస్తూ రేణిగుంటలోని తెలుగు ఆదర్శ పాఠశాలకు బదలాయిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ముస్లిం మైనార్టీల మనోభావాలు దెబ్బతినకుండా పాఠశాలను కొనసాగించాలని కోరారు. ముస్లిం మత పెద్దలు నయాబ్ రసూల్, షేక్ ఖాసీం పీరా, మొహమ్మ ద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు

రేపు సత్యవేడుకు నారా లోకేష్ రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 7, 8 తేదీల్లో రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం ముంబాయి నుంచి బయల్దేరి బుధవారం మధ్యాహ్నం 3.30కు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. రోడ్డుమార్గాన సాయంత్రం 5.10 గంటలకు సత్యవేడులోని విఎంకె కల్యాణ మండపానికి చేరుకుని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8వ తేదీ ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీ చేరుకుని ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ వారి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి 2.30కి చేరుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఇళ్లస్థలాలకై జానపదకళాకారుల ధర్నా

ప్రజాశక్తి - దొరవారిసత్రం


మండలంలోని జానపద కళాకారులకు ఇళ్లస్థలాలివ్వాలని జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి మాట్లాడుతూ గతంలో కళాకారులకు ఇచ్చిన ఇళ్లస్థలాలను రాజకీయ నాయకులు ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామీణ కళలు అంతరించిపోకుండా కృషి చేస్తున్న వారి కృషిని గుర్తించి గత ప్రభుత్వాలు ఒక్కొక్కరికి ఐదు సెంట్లు స్థలాలను ఇచ్చారు. ప్రస్తుతం వారి స్థలాలను పెత్తందారులు కబ్జా చేస్తున్నారని, కళాకారుల స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం మండల కళాకారులు మల్ల రమణయ్య, రామ్మూర్తి, మునీంద్ర, మల్లర సాయి, శ్రీను, మునస్వామి పాల్గొన్నారు.

టిటిడి వారి శిల్ప శిక్షణా సంస్థలో..

శిల్పం..అపు'రూపం'..!

- జూన్ 20 వరకూ దరఖాస్తులకు ఆహ్వానం
- అర్హులైన విద్యార్థులకు రూ.లక్ష డిపాజిట్

ప్రజాశక్తి - తిరుపతి సిటి



సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను సంరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించేందుకు టిటిడి విశేష కషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిటిడి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ ఏకైక సంస్థగా పేరొందింది. భారతీయ సాంప్రదాయ ఆలయ శిల్పకళ, నిర్మాణ రంగంలో నైపుణ్యం గల వ్యక్తులను శిక్షణ ఇస్తున్న ఒక ప్రత్యేక సంస్థ. భారతీయ సంస్కతి, వారసత్వానికి దిశా నిర్దేశకులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ సంస్థ సహాయపడుతుంది. ఈ సంస్థ ఆలయ నిర్మాణ శిల్పకళ, వాస్తుశిల్పం, ఇతర సంబంధిత కళా రూపాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. 1960వ సంవత్సరంలో స్థాపించి శిల్పశాస్త్రాల ప్రకారం విద్యార్థులకు టిటిడి శిక్షణ ఇస్తోంది.

డిప్లొమా ఇన్ ట్రెడిషనల్ స్కల్చర్ కోర్సు

రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ, ఏపీ, ఏఐసిటిఈ, న్యూఢిల్లీ వారి అనుమతి పొందింది. ఈ కోర్సు 4 సంవత్సరాల కాలపరిమితితో 6 విభాగాలు ఉండగా, అందులో 1. ఆలయ నిర్మాణ విభాగం 2. శిలా శిల్ప విభాగము, 3. సుధా శిల్ప విభాగము, 4. లోహ శిల్ప విభాగము, 5. కొయ్య శిల్ప విభాగము, 6. సంప్రదాయ వర్ణచిత్ర లేఖన విభాగములు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఒక్కొక్క విభాగంలో పది మంది విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశము కలదు. మొత్తం ఆరు విభాగాలలో 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశము కల్పించబడుతుంది. డిప్లొమా కోర్సులో చేరే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుంది. నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆలయ నిర్మాణ శిల్పకళా విజ్ఞానం కొరకు దక్షిణ భారతదేశంలోని ప్రముఖ చారిత్రక ఆలయాల సందర్శనకు ఉచితంగా పంపబడును. శిలా శిల్పంలో ఉత్తీర్ణులైన వారికి విసతంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.



సంప్రదాయ కలంకారి కళ (సర్టిఫికెట్ కోర్సు)

వస్త్రాలపై కలంకారికళ చిత్రరచనా విధానంపై రెండు సంవత్సరాల సర్టిఫికేట్ కోర్సు ఉంది. కలంకారి కళలో పదవ తరగతి పాసైన వారు ప్రతి సంవత్సరం 10 మంది విద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ప్రవేశం పొందిన విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం కల్పించబడును. కలంకారి కోర్సు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు స్వయం ఉపాధిని పొందవచ్చు. దేశ విదేశాలలో కలంకారి కళకు మంచి ఆదరణ ఉంది.

ప్రవేశం

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి ప్రతి సంవత్సరం మే లేదా జూన్ నెలలో ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. 2025 - 26 సంవత్సరానికి మే 5 నుండి జూన్ 20వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థినీ విద్యార్థుల పేరిట, తిరుమల తిరుపతి దేవస్థానంవారు రూ. 1 లక్ష జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. యాజమాన్యం వారి నియమావళి ప్రకారం ఈ కళలో స్థిరపడుటకు, వారిని ప్రోత్సహించుటకు వడ్డీతో సహా కలిపి ఈ నగదు ఇవ్వబడును.

ఉపాధి అవకాశాలు

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఇదే సంస్థలో ఉపాధ్యాయులుగా, తితిదే రినోవేషన్ విభాగంలో స్థపతులుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా, కాంట్రాక్టర్లుగా అవకాశాలు పొందుతున్నారు. అంతేగాక ప్రభుత్వ శాఖలైన దేవాదాయ, ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖ, పురావస్తు పరిశోధనా శాఖల్లో పనిచేస్తూ అనేక జాతీయ సంస్థల నుండి అవార్డులు సాధిస్తున్నారు. శిల్పశిక్షణ సంస్థకు అనుబంధంగా ఉన్న శిలా శిల్ప ఉత్పత్తి విభాగంలో కొందరు విద్యార్థులు కాంట్రాక్ట్ పద్ధతిన దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేస్తున్నారు.

వివరాలకు

శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ, టీటీడీ, అలిపిరి రోడ్, తిరుపతి - 517507, ఆఫీస్ ఫోన్ నెంబర్ - 0877 - 2264637.

మున్సిపాలిటీ సర్వేతో ఆందోళన



ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, నాయుడుపేట మండలంలోని పొగ గొట్టం కాలనీలో మున్సిపల్ అధికారులు సర్వేలు నిర్వహించారు. ఈ సర్వేల కారణంగా అక్కడ నివసిస్తున్న పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా నాయుడుపేట పొగ గొట్టం కాలనీలో ఎంతో మంది ప్రజలను నివసిస్తున్నారు. వీళ్ళు నివసిస్తున్న భూమి తమదని, దీనిపై ఎవరికీ హక్కు లేదని వెంకటగిరి రాజా యాచేంద్ర కుటుంబీకులు ఈ స్థలంపై కోర్టులో దావా వేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ స్థలం ఎవరికి చెందుతుంది అన్న విషయంపై కోర్టు తీర్పు రావాల్సి ఉంది. ఈ క్రమంలో మునిసిపల్ కమిషనర్ పజిల్లుల్లా, పట్టణ ప్రణాళిక అధికారి బాలసుబ్రమణ్యంల ఆదేశాల మేరకు ఆ కాలనీలో మునిసిపల్ అధికారులు సర్వేలు నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా అక్కడ నిర్మాణాలు చేపడుతున్న వారి పేర్లు, ఇంటి విస్తీర్ణం వంటి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సర్వేలు ఎందుకు నిర్వహిస్తున్నారన్న పూర్తి సమాచారం లేకపోవడంతో కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అందులోనూ ఈ సర్వే పూర్తిగా నిర్వహించకుండా కొన్ని ఇళ్లుమాత్రమే సర్వే చేశారని, మిగిలిన వాటిలో సర్వే నిర్వహించడంతో మరింత ఆందోళనగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కోర్టులో ఉన్న స్థలాలపై మున్సిపల్ అధికారులు ఇప్పుడు ఎందుకు సర్వేలు నిర్వహిస్తున్నారు అన్నది తెలియక ఆ స్థలాలు ఎక్కడ చేజారిపోతాయన్న భయంతో ఎవరిని ఆశ్రయించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజలు-శ్రీకాళహస్తి : ఎండలు మండిపోతున్న తరుణంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తంగేళ్లపాలెం ప్రాథమిక సహకార సంఘం సీఈవో చిరంజీవి రెడ్డి సూచించారు. స్థానిక తంగేళ్ల పాలెం సహకార బ్యాంకు కార్యాలయం వద్ద సోమవారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఖాతాదారులకు, మజ్జిగ మంచినీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు సిబ్బంది శేఖర్, శ్రీనివాసులు, వాసు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన కార్యకర్త జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలో సోమవారం ఉదయం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త గురువర్ధన్ జన్మదిన వేడుకలు జనసేన కార్యకర్తలు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, తొట్టంబేడు మండలం జనసేన పార్టీ మండల ప్రెసిడెంట్ పేట చిరంజీవి, చందు, లక్ష్మణ్, దినేష్ దివాకర్, హరి యాదవ్, సూర్య, లోకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వేసవి సెలవులను కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు సిడిపిఓ ప్రమీల పేర్కొన్నారు. వడమాలపేట జడ్పీహెచ్ఎస్ బాలురల పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ ప్రమీల మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 తారీకు వరకు బాలికలకోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక అంశాలపై అవగాహనతో పాటు, విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు పద్మావతి, తులసి రామ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రోజా రమణి, మనీలా, ఏ పి మ్ మునికృష్ణయ్య, పి హెచ్ ఎన్ మంజుల, ఎమ్ ఎస్ కె లు, అంగన్వాడి కార్యకర్తలు, డిఆర్డిఏ సిబ్బంది, ఏ ఎన్ ఎం లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



రోడ్డు పక్కన కరెంటు స్తంభాలు లేని దృశ్యం
అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, కీలపూడి పంచాయితీ, దళితవాడకు చెందిన యువకులు వీధి స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని, పిచ్చాటూరు మండల పరిషత్ అధికారి మహమ్మద్ రఫీక్ సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడ ప్రజలు పరిసరాల అపరిశుభ్రతతోను, రాత్రయితే చీకటి రోడ్లపై నడవడానికి భయపడుతున్నారని తెలిపారు. సత్వరమే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భోజన ప్యాకెట్లు వితరణ




ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరులో పలు ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లను తిరుమల శెట్టి నారాయణ పంపిణీ చేశారు. యల్లాప్రగడ సత్యనారాయణ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా దత్త పుత్రులైన తిరుమలశెట్టి నారాయణ చేతుల మీదుగా 402 మందికి భోజన ప్యాకెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కాలేషా, తూపిలి మహేష్, గుండాల ధనుంజయ, జనార్ధన్, కిషోర్, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏపిటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు గ్రామ రెవెన్యూ సేవకుల భవనం ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కరించాలని కోరుతూ, ఏపీటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే కొనసాగిస్తూ మరింత గందరగోళ పరిస్థితులను కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్ మోహన్ దాస్, జిల్లా నాయకులు వై.సుబ్రహ్మణ్యం రాజు, గూడూరు, చిల్లకూరు ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే పోర్టర్లకు జీవనోపాధి చూపాలి



ఎంపీ గురు మూర్తికి రైల్వే పోర్టర్ల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ నేపథ్యంలో ఉపాధి కోల్పోతున్న లైసెన్స్‌డ్ పోర్టర్లకు జీవనోపాధి చూపించాలని ఎంపి మద్దిల గురుమూర్తి రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో గత 15-30 సంవత్సరాలుగా సేవలందిస్తున్నామని, స్టేషన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, బ్యాటరీ వాహనాలు, లగేజ్ ట్రాలీల వల్ల కూలీల అవసరం తగ్గిపోవడంతో తమ ఆదాయం పడిపోయిందని వివరించారు. స్టేషన్ ఆధారిత ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, లైసెన్స్‌డ్ పోర్టర్ సేవలను కొనసాగించాలని, ఆఫ్‌లైన్ బుకింగ్ సదుపాయం అందుబాటులో ఉంచాలని, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని పోర్టర్లు ఎంపి దృష్టికి తీసుకెళ్లారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గంగమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాతర ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న తాతయ్యగుంట గంగమ్మ జాతరకు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలలో కొరకు చేసిన ఏర్పాట్లు, ఇంటిదారిలో క్యూ లైన్లు, పొంగళ్ళు కొరకు చేయాల్సిన ఏర్పాట్లు గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంగ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. దర్శనానికి అనుమతించే ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, వివిఐపి లు వెళ్ళే క్యూ లైన్లను పక్కగా చేయాలని అన్నారు. కమిషనర్ వెంట రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, ఆర్వోలు రామ్మోహన్ పాల్గొన్నారు.

నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి నేలకూలిన చెట్లను, విద్యుత్ స్తంభాలను త్వరగా తొలగించాలని మేయర్ డాక్టర్ శిరీష ఇంజినీరింగ్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి 11, 27 డివిజన్ పరిధిలోని చిన్నకాపువీధి, పెద్దకాపువీధి, తాతనగర్‌లలో సోమవారం ఉదయం దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డి.ఈ. రాజు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సత్యవేడు : సత్యవేడు ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ అధికారుల వేధింపులకు సంబంధించి డ్రైవర్ గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు బృందం విచారణ నిర్వహించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గంగయ్య ఫిర్యాదుపై విజిలెన్స్ అధికారి తిమ్మారెడ్డి, సీఐ వర్మ బృందం విచారణ జరిపారు. ఏప్రిల్ 29వ తేదీ డ్రైవర్ గంగయ్య డ్యూటీ నిమిత్తం ఆర్టీసీ గ్యారేజ్‌కి చేరుకున్నారు.ఆర్టీసీ బస్సును కూడా సెక్యూరిటీ పాయింట్ వద్దకు తీసుకెళ్లి ఆపారు. అయితే మధ్యాహ్నం వరకు కండక్టర్ రాకపోవడంతో రూట్లో వెళ్లాల్సిన ఆర్టిసి బస్సును ఉన్నపళంగా ఆర్టీసీ డిఎం వెంకటరమణ రద్దు చేశారు. అయితే మధ్యాహ్నం నుంచి మూడు గంటలకు డ్యూటీకి వెళ్లాలని డిఎం వెంకటరమణ డ్రైవర్ గంగయ్యను ఆదేశించారు. అయితే తనకున్న అనారోగ్య పరిస్థితి దృష్ట్యా రాత్రి డ్యూటీకి వెళ్లలేనని గంగయ్య చెప్పడంతో డిఎం వెంకటరమణ దుర్భాషలాడారు. దీంతో డ్రైవర్ గంగయ్య సెక్యూరిటీ పాయింట్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ కూడా సెక్యూరిటీ అధికారి పళని జోక్యం చేసుకొని, రాత్రి డ్యూటీకి వెళ్లాల్సిందేనని డ్రైవర్ గంగయ్యను అజమాయిషీ చేయడంతో, మానసికంగా ఆవేదన చెందిన గంగయ్య హైబీపీ కారణంగా కింద పడిపోయి గిలగిల తనుకున్నారు. ఈ నేపథ్యంలో తోటి కార్మికులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో తనపై జరిగిన వేధింపులు సంబంధించి డ్రైవర్ గంగయ్య విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు రంగంలో దిగి విచారణ చేశారు. వేధింపులకు సంబం ధించి విజిలెన్స్ విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశాలు ఉన్నాయి.

ప్రయాణికులే టికెట్ తీసుకోవాలి

ప్రజాశక్తి - సత్యవేడు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే టికెట్ తీసుకునే బాధ్యతను చట్ట పరంగా అమలు చేయాలని సత్యవేడు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రటరీ వి.బాబు కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల సాధన కోసం అసోసియేషన్ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు యూనియన్ నాయకులు సోమవారం డిప్యూటీ తహశీల్దార్ త్యాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు డిపో సెక్రటరీ బాబు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు డిపో అధ్యక్షులు పార్థసారథి, గ్యారేజ్ అధ్యక్షులు కుప్పయ్య, గ్యారేజ్ కార్యదర్శి ఎస్ శేఖర్, సిసిఎస్ డెలిగేట్ సురేష్, జాయింట్ సెక్రటరీ ఎంఆర్ రవి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతి సహించం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగితే సహించేది లేదని వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు సింహాల మోహన అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీడీవో గిడ్డయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని విమర్శించడం అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు ముని రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు హరినాథ్, నాయకులు టిల్లుకుమార్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి, మణి, ఉమాపతి, కొండారెడ్డి, ఖదీర్ అహ్మద్, దినేష్ రెడ్డి, రఘునాథ్, సుధాకర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - సత్యవేడు: ఈ నెల మే 7,8 తేదీలలో రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం మంత్రి నారా లోకేష్ రానున్నారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, 3.40 గంటలకు రేణిగుంట ఎయిర్పోర్ట్ నుండి రోడ్డు మార్గాన సాయంత్రం 5.10 గంటలకు విఎమ్‌కె కల్యాణ మండపం, సత్యవేడుకు చేరుకొని 5.30 గంటల నుండి రాత్రి 8.00 గంటలకు వరకు అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8 వ తేది ఉదయం 10.50 గంటలకు శ్రీసిటీ చేరుకొని 11.00 నుండి మధ్యాహ్నం 1.00గంట వరకు ఎల్ జి ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ వారి భూమి పూజ, శంఖు స్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం శ్రీసిటీ నుండి రోడ్డు మార్గం ద్వారా రేణిగుంట విమానాశ్రయం 2.30కి చేరుకొని హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

షార్‌లో అగ్నిమాపక వారోత్సవ ముగింపు వేడుకలు



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. స్థానిక బ్రహ్మప్రకాష్ ఆడిటోరియంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.ఎన్.బి. సింఘానె డైరక్టర్ నేషనల్ పై సర్వీస్ కాలేజ్, (ఎన్ ఎఫ్ ఎస్ సి) నాగపూర్ ని ఆహ్వానించారు. ఏ. రాజరాజన్ డైరక్టర్ షార్ అధ్యక్షత వహించగా, ఎం. శ్రీనివాసులు రెడ్డి కంట్రోలర్ షార్ డిప్యూటీ డైరక్టర్లు, షార్ సీనియర్ మేనేజ్మమెంట్ ప్రతినిధులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు. వేడుకలను పురస్కరిస్తు నిర్వహించిన వివిధ పోటీలలో గెలిచిన వారికి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమాన్ని పీ.వెంకటరెడ్డి సీఎం సెట్ ఆపరేషన్ సిస్టమ్స్ ఏంటిది (ఎస్ ఓ ఎస్ సి) ఆద్వర్యంలో నిర్వహించారు.

ఏపిపిజిసెట్-2025 ఆన్లైన్ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి పక్షాన ఏపిపిజిసెట్ - 2025 నిర్వహణ బాధ్యతలను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది.. మార్చి 31 వ తేదీన ఏపిపిజిసెట్ - 2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 2 వ తేదీన ఆన్లైన్ దరఖాస్తులు ఆరంభమయ్యాయి. మే నెల 5 వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ గడువు తేదీని ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మే నెల 11 వ తేదీ వరకు ఉన్నత విద్యా మండలి అనుమతతో పొడిగించినట్లు పిజిసెట్-2025 ఛైర్మన్ ఆచార్య అప్పారావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ విసి, పిజి సెట్ ఛైర్మన్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ తొలిసారిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఏపిపిజిసెట్-2025 నిర్వహించే బాధ్యతను ఉన్నత విద్యామండలి అప్పగించిందని, ఈ సారి ఎం.ఏ, ఎం.కామ్., ఎం.ఎస్సీ., వంటి పి.జి. కోర్సుల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఆన్లైన్ అప్లికేషన్ గడువు తేదీని ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మే 11వ తేదీ వరకు పొడిగించామని తెలిపారు. ఇంకా కొన్ని విశ్వవిద్యాలయాలలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయని, అందువల్ల విద్యార్థుల అభ్యర్థన మేరకు 6 రోజుల పాటు గడువు తేదీని పొడిగించామని అన్నారు. 1000 రూపాయల అపరాధ రుసుముతో మే నెల 12 వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు, 2000రూపాయల అపరాధ రుసుముతో మే నెల 20 వ తేదీ వరకు, 4000 రూపాయల అపరాధ రుసుముతో మే నెల 24 వ తేదీ వరకు, 10000వేల రూపాయల అపరాధ రుసుముతో మే నెల 25 వ తేదీ వరకు అన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని వారు వివరించారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష 153 కోర్సుల్లో చేరడానికి 31 పరీక్షలను జూన్ 9 నుంచి 13వ తేదీ వరకూ మూడు సెషన్స్‌లో నిర్వహిస్తారని, 13 పాత జిల్లా కేంద్రాలను ఆధారంగా దాదాపు 35 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 22 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, విద్యార్థులు ఈ సదవకాశం వినియోగించు కోవాలని తెలిపారు.

మద్దాలి రాజీనామా ఉపసంహరణ

ప్రజాశక్తి -కోట : టిడిపిలో మేమంతా ఒకే కుటుంబమనీ, ఎవ్వరూ విడదీయలేరని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కోట మండలంలోని మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి నివాసంలో టిడిపి ఆత్మీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి పార్టీకోసం కష్టపడిన వ్యక్తి అన్నారు. అటుండి వారిని పార్టీ వదులుకోదని స్పష్టం చేశారు. ఇటీవల మద్దాలి సర్వోత్తమ రెడ్డి పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే ఆ రాజీనామాను ఈ సమావేశంలో మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో ఉపసంహరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, వాకాడు మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డి, టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ దారా సురేష్, షంషుద్దీన్, కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, కోకర్ల మధు యాదవ్, మాజీ మండలాధ్యక్షుడు పాదర్తి కోటారెడ్డి, తీగల సురేష్ బాబు, రాధాకృష్ణారెడ్డి, కొనిశెట్టి రమేష్, వాకా విజయభాస్కర్ రెడ్డి, పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి, షేక్ మస్తాన్ బాష, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి పిలుస్తుంది రండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బడి ఈడు పిల్లలతో పాటు 5 వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులను 6వ తరగతిలో బడిలో చేర్పించాలని సోమవారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల పరిధిలోని కల్లివెట్టు, తలారివెట్టు గ్రామాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళిలు విద్యార్థులు ఇంటి వద్దకు వెళ్ళి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, రవీంద్రనాథ్‌లు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెలవాయి పరిధిలోని వేణుగోపాలపురం హెచ్ డబ్ల్యు కాలనీ గిరిజన కాలనీని వారు సందర్శిం చారు. వారు మాట్లాడుతూ 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను సమీప నెలవాయి ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం జ్యోతి పద్మ ఈశ్వరమ్మ , పిఆర్పి ప్రసూన పాల్గొన్నారు.

గిరిజనులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ప్రక్కనే ఉన్న ఈబీసీ గిరిజన కాలనీ వాసులు సోమవారం సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామ సర్పంచి బూదూరు వెంకటమ్మల ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాలకోసం తహశీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటమ్మ మాట్లాడుతూ కాలనీలో ఒక్కో ఇంటిలో రెండు మూడు కుటుంబాలను నివసిస్తున్నారని, 20 సంవత్సరాలుగా కొత్తగా తహశీల్దార్ వచ్చినప్పుడల్లా ఇంటి స్థలాలు కావాలని వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నామని తెలిపారు. స్పందించిన తాసిల్దార్ శ్రీదేవి మండల స్థాయి రెవిన్యూ అధికారులను కాలనీకి పంపించి, సర్వే చేసి న్యాయం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రమ్మ, చిరంజీవి, బాబు, ఈబీసీ కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ఆపండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బాల్య వివాహాలు జరగకుండా ఉండాలంటే కిషోర్ వికాస్ గ్రూపులను పటిష్టం చేయాలని సిడిపిఓ ప్రమీల పేర్కొన్నారు. పుత్తూరు పరిధిలో మున్సిపాలిటీ ఏరియా అంగన్వాడీ కార్యకర్తలకు, మెప్మా ఆర్పిలకు ఏఎన్ఎంలకు, మహిళ పోలీసులకు, కిశోర్ వికాసం సమ్మర్ సమ్మర్ క్యాంపెయిన్‌లో కొత్త మున్సిపల్ ఆఫీసులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల పిల్లల లిస్టు తయారుచేసి, వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారికి రుతుక్రమ పరిశుభ్రత, బాల్యవివాహాల నిరోధం బాలల హక్కులు, లింగ సమానత్వం, బాలికల విద్య ప్రాముఖ్యత, సైబర్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల గురించి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కె.ప్రమీల, సీఎంవో సునీత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు బి.గీతాంజలి, పి.సంధ్య, అనిత పాల్గొన్నారు.

'ఈజీ మార్ట్' ప్రారంభించిన బొజ్జల సుధీర్



ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం గుత్తి వారి పల్లిలో ఈజీ మార్ట్‌ను (రూరల్ కామర్స్ అనే ఆన్లైన్ మార్కెటింగ్ కం సేల్స్) ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇది డిఆర్డిఏ వెలుగు సిబ్బందితో సూచించబడిన సభ్యుల ఎంపికతో నిత్యవసర సరుకులు అమ్మకపు స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి అన్ని రకాల బ్రాండెడ్ వస్తువుల పైన ఐదు శాతం వరకు ఆదాయాన్ని సమకూరుస్తూ అవసరమైతే లోను ఇప్పిస్తూ రూరల్ స్మార్ట్ స్టోర్ ను స్థాపించే విధంగా వెంకట్ నేలపాటి బోస్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతా విస్తరిస్తున్నారు. రేణిగుంటలో ఆరో యూనిట్‌గా ప్రారంభించారు. సర్ఫ్ వారితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు మునిస్వామి నాయుడు, చిన్న రెడ్డి పాల్గొన్నారు.

8న 'గీతం'లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఈనెల 8వ తేదీ జరగనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఉదయం ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. భవానీనగర్ సర్కిల్‌లో ఉన్న గీతం స్కూలులో 8వ తేదీ ఉదయం 8 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్ , ఈఎంసి క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని బహుళ జాతీయ కంపెనీలలో 700 పైగా ఉద్యోగాల కోసం మేళాలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి లోకనాథం, టిడిపి నాయకులు మహేష్ యాదవ్, ఎస్వీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ రమణ, సురేష్, శ్రీగణేష్ పాల్గొన్నారు.

'ఏపీపీఎస్సీ గ్రూప్-1'పరీక్షకు 619 మంది హాజరు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 619 (67.95 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. వేసవి ఎండల దష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డిబిఆర్ కళాశాలను, ఎస్వీయూలోని ఆర్ట్స్ కాలేజీలోనూ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు.

ఏనుగుల విధ్వంసం నుంచి రైతులను కాపాడాలి

ప్రజాశక్తి - రేణిగుంట: ఏనుగుల విధ్వంసం నుంచి రైతులను కాపాడాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత డిమాండ్‌చేశారు. రేణిగుంట మండలం మామండూరుకు చెందిన 130 ఎకరాల మామిడితోటలో చందూర, బెంగుళూరు, బెనిష, నీలం, రుమానియా రకాలు పండిస్తున్నారని, చేతికొచ్చిన పంటను గత 20 రోజులుగా ఏనుగులు ధ్వంసం చేశాయని, రైతులకు ప్రాణహాని ఉందని ఫారెస్టు అధికారులకు, కలెక్టర్‌కు, నియోజకవర్గ ఎంఎల్ఏకు చెబుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం ధ్వంసమైన పంటలను రైతుసంఘం బృందం కొండ్రెడ్డి హరినాథ్, సెల్వరాజ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో సెలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, లేనిచో రహదారి దిగ్బంధం చేస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గూడూరు డిపో ఉద్యోగుల ఆధ్వర్యంలో, ఎన్ఎంయు నాయకులు సమస్యలు పరిష్కారానికి ఎమ్మార్వో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/ 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెండ్‌లను ఆపాలని, గ్యారేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ అహ్మద్, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసులు, డిపో సెక్రటరీ శ్రీనివాసులు, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, డిపో ట్రెస్సరర్ గౌస్, పోలయ్య, బాబు రావు, రమణయ్య, గులాం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండలం, కలవకొండ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పోస్టర్స్‌ను కుమార్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రవి కృష్ణ ,ఫెస్టివల్ కమిటీ ఛైర్మన్ చిరంజీవి, బాబి తదితరులు పాల్గొన్నారు.

లా పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిధిలో జరుగుతున్న బి.ఎల్. మూడవ సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావు సోమవారం పరిశీలించారు. అంజిమేడులోని ఈశ్వర్ రెడ్డి న్యాయ కళాశాలలో మూడవ సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఒకరిని మాల్ ప్రాక్టీస్ కింద నమోదు చేయడాన్ని చూసి ఇన్విజిలేటర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల్ ప్రాక్టీస్ అనుమతించవద్దని పరిశీలకులను ఆదేశించారు.

సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం ఉదయం నారాయణవనం మండలం, అరణ్యంకండ్రిగలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నూతన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకం ఆవిష్కరించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాద రక్షలు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజావీది, శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆద్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికీ దాతగా విరజ 5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రోహిణామ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనూజ, కార్యదర్శి అనిత శశి రేఖ, భవానీ ఇంకా రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ వెంకటగిరి మండల ఉపాధ్యక్షులు ఎంవి రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, స్థానిక సెక్రెటరీ ప్రసాద్‌లు మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె ఒప్పందాలకు వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం కోశాధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈహెచ్ఎస్ వైద్యం సరిగా అందించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కండక్టర్లకు, డ్రైవర్లకు ఆరోగ్యం వస్తే ఈహెచ్ఎస్ వైద్యం సరిగా అందక ప్రాణాలు కోల్పోతున్నారని డిపో అధ్యక్షులు ఎస్.సుందరం, సెక్రెటరీ ఎం.శివకుమార్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ యూనియన్ అసోసియేషన్ పుత్తూరు డిపో అధ్యక్షులు కార్యదర్శులు, సోమవారం పుత్తూరు తాసిల్దారును కలిసి కార్మికుల సమస్యలపై వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కార్యదర్శి మాట్లాడుతూ ఆర్టిసి కార్మికుల వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిపో అడ్వైజర్ కేసి రాయలు, సహాయ కార్యదర్శి బీసీ శేఖర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ హేమంత్ కుమార్‌లుపాల్గొన్నారు.

శివం టూ శివం రోడ్డు ఆక్రమణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు పాలకులు శివం టూ శివం రోడ్డు నిర్మాణానికి పాలకులు శ్రీకారం చుట్టారు. మాస్టర్ ప్లాన్‌లో ఇదొక భాగం. అయితే రాజగోపురం సమీపంలోని రామాలయం వద్ద శివం టూ శివం రోడ్డులో ఒకరు సోమవారం అక్రమ నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేశారు. అయితే ఈ నిర్మాణాన్ని అక్కడి ఆటో యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో గత 27 ఏళ్లుగా రూరల్ ప్రాంత ఆటో స్టాండ్ నిర్వహిస్తున్నారు. దేవస్థానికి చెందిన స్థలంలో ఓ వ్యక్తి పట్ట పగలే నిర్మాణం చేపడుతున్నా అధికారులు అడ్డుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ కేంద్రంలో ఇవ్వనున్న డోమాస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఈ నెల 15 లోపూ దరఖాస్తుచేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఈ శిక్షణతో నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి పొందవచ్చన్నారు. పదవ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ వరకు చదువుకున్న వారు కళాశాలలోని రసూల్ 6300954441ను సంప్రదించి ఆధార్ కార్డు, మార్కులు జాబితా జెరాక్స్ కాపీ, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని స్కిల్ హబ్ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసిన వారికి రాష్ట్ర స్కిల్ హబ్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వనున్నామన్నారు. నగరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ప్రణీత్ ఫౌండేషన్' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి : ప్రణీత్ ఫౌండేషన్ వారు అందిస్తున్న ఉచిత అంబులెన్స్ మార్చురీ సేవలు అభినందనీయం అని టిటిడి అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుపతిలో స్థానికంగా ఉన్న స్వీకార్ (టాటా క్యాన్సర్ హాస్పటల్) వారి మూడవ వార్షిక మహోత్సవంలో ప్రణీత్ ఫౌండేషన్ వారు అందిస్తున్న ఉచిత అంబులెన్స్ మార్చురీ సేవలను ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ పెనుమాడును టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, ఐజర్ డైరెక్టర్ ఆచార్య సంతాను భట్టాచార్య, ఐఐటి డైరెక్టర్ ఆచార్య కే ఎన్ సత్యనారాయణ, టాటా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శర్మ ప్రశంసిస్తూ శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ పెనుమాడు మాట్లాడుతూ జ్ఞాపికను అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందని ప్రణీత్ ఫౌండేషన్ వారు రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాన్నారు.

రేపటినుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: పట్టణంలోని జిఎన్‌టి రోడ్డులో కొలువై ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి 332వ ఆరాధన మహోత్సవాలను ఈనెల ఏడో తేదీ ప్రారంభించి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. చిట్టేటి పందయ్య కుమారులు చిట్టేటిపెరుమాళ్, ఆయన సోదరుల పర్యవేక్షణలో ఉభయదాతల సహకారంతో ఈ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. ఎంఎల్ఏ నెలవల విజయశ్రీ దంపతుల సహకారంతో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరపున్నట్లు నిర్వాహకులు తెలిపారు.